క్లుప్తంగా

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నిక

నల్లజర్ల: తూర్పు గోదావరి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శిగా గోపాలపురం నియోజకవర్గంకు చెందిన శెట్టిపల్లి శివనాగరాజు వరుసగా రెండో సారి ఎంపికైనట్టు సోమవారం ఆయన విలేఖర్లకు తెలిపారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర నియామకపు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. గతంలో ఆరు సంవత్సరాలు నల్లజర్ల మండల శాఖ అధ్యక్షుడిగా, ఒక సంవత్సరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా, రెండేళ్ల జిల్లా ఉపాధ్యక్షుడిగాను, మరో రెండున్నర సంవత్సరాలు జిల్లా ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించినట్లు ఆయన పేర్కొన్నారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, పిక్కి నాగేంద్ర, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోమువీర్రాజులకు కృతజ్ఞతలు తెలిపారు.

మావుళ్లమ్మకు ఆషాఢం సారె


అమ్మవారికి స్వీట్లు, పిండి వంటలతో ఏర్పాటు చేసిన సారె

తాళ్లపూడి: మండలం ప్రక్కిలంక గ్రామంలోని శ్రీ మావుళ్లమ్మ అమ్మవారికి ఆశాఢ మాసాన్ని పురష్కరించుకుని సోమవారం గ్రామస్తులు వైభవంగా సారెను సమర్పించారు. అర్చకుడు కొతరపు విశ్వనాథ శర్మ ఆధ్వర్యంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి 108 రకాల పిండి వంటలు, స్వీట్ల సారెను వైభవోపేతంగా డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. గ్రామ మహిళలు మాట్లాడుతూ గ్రామ పెద్ద ఆడపడుచుగా కొలిచే మావుళ్లమ్మకు తొలిసారిగా అనేకరకాల పిండి వంటలు స్వీట్లు, పువ్వులు, పళ్లు సమర్పించి భక్తి శ్రద్ధలతో సారె సమర్పించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు.

ఆర్థిక సాయం అందజేత

తాళ్లపూడి: ఆనారోగ్యం కారణంగా భర్త మరణించడంతో పెద్ద దిక్కును కోల్పోయి, కుమార్తె పోషణకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న సూరయ్యపేటకు చెందిన కడిమి సౌదామినికి మానవత సేవా సంస్థ ఆర్థిక సాయాన్ని అందించింది. ఈ మేరకు సోమవారం సంస్థ అధ్యక్షుడు వెలుగుబంటి శ్రీనివాస్ అధ్యక్షతన సేవా సంస్థ తరపున ఆరు వేల రూపాయిలను అందించారు. కష్టాల్లో ఉన్నవారి ఒక్క కన్నీటి బొట్టునైనా తుడవడమే సంస్థ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ వాసిబోయిన చంద్రయ్య , చైర్మన్ సింహాద్రి జనార్ధనరావు, సనపల రాజశేఖర్, అప్పన హనుమంతరావు, పెమ్మాడి దుర్గాప్రసాద్, తలారి రామ్మోహనరావు, సాయన సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానం ట్రస్ట్‌కు విరాళం


నిత్యాన్నదానం ట్రస్ట్‌కు విరాళాన్ని అందచేస్తున్న దాత రామకోటేశ్వరరావు

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారి నిత్యాన్నదానం ట్రస్ట్‌కు 1.28 లక్షల విరాళం అందినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. ఈ మేరకు చాగల్లు మండలం మార్కొండపాడు గ్రామానికి చెందిన ఈదర గంగాభవాని జ్ఞాపకార్థం భర్త రామకోటేశ్వరరావు సోమవారం 1.28 లక్షల విరాళాన్ని అందజేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం దాత కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ దేవులపల్లి రవిశంకర్, ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి స్థలం కేటాయింపు

దేవరపల్లి: మండల కేంద్రంలో నిర్మించనున్న బాలోత్సవ కమిటీ భవన నిర్మాణానికి గ్రామ పంచాయతీ సుమారు 6 సెంట్ల స్థలం కేటాయించింది. స్థానిక ప్రభుత్వ కార్యాలయాల సముదాయం సమీపంలోని లేఅవుట్‌లో 6 సెంట్ల స్థలం భవన నిర్మాణానికి ఇవ్వడానికి గ్రామ పంచాయతీ తీర్మానించినట్టు ఎంపీపీ కేవీకే దుర్గారావు తెలిపారు. తీర్మాన పత్రాన్ని సోమవారం బాలోత్సవ కమిటీ ప్రతినిధి ఉండవల్లి కృష్ణారావు, కమిటీ సభ్యులకు ఎంపీపీ దుర్గారావు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు కడిమి రాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిడదవోలు రూరల్: మండలంలోని పురుషోత్తపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని విజ్జేశ్వరం, పెండ్యాల గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.నారాయణ అప్పారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళ, బుధవారం రెండు రోజులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు గృహ, పరిశ్రమ, వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని రెండు గ్రామాల వినియోగదారులంతా సహకరించాలన్నారు.

అటకెక్కిన ప్రభుత్వ వైద్యం

- సీజనల్ వ్యాధులతో ఆసుపత్రుల కిటకిట
- అపరిశుభ్రతతో రోగాల బారిన ప్రజలు
- నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో అందని వైద్యసేవలు


నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో వైద్యం పొందుతున్న రోగులు

నిడదవోలు రూరల్: నియోజకవర్గంలోని గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పల్లెల్లోని వీధులన్నీ మురుగుతో దర్శనమిస్తున్నాయి. అపారిశుద్ధ్యం తాండవం చేస్తుండటంతో దోమల విజృంభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. వర్షకాలంలో కావడంతో సీజనల్ వ్యాధులతో పల్లె, పట్టణం తేడా లేదు.. ఇంటికొకరు అనారోగ్యానికి గురవుతున్నారు. వాంతులు వీరేచనాలు, వైరల్ ఫీవర్, టైపాయిడ్, మలేరియా, చికెన్‌గున్యా, డెంగీ తదితర వ్యాధులు సులభంగా వ్యాపిస్తున్నాయి. ఈ కారణంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, చిన్నపిల్లల వైద్యులు, గైనకాలజిస్ట్ లేరు. ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యసేవలు అందిస్తామని కూటమి నాయకులు వాగ్దానాలు చేశారే తప్ప, వైద్య సేవలను మెరుగుపర్చడంలో కానీ, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక లక్ష్యం నెరవేరడంలేదు.

నియోజకవర్గంలోని పరిస్థితి ఇలా..

నిడదవోలు నియోజకవర్గంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంతో పాటు, సమిశ్రగూడెం, తాడిమళ్ల, కానూరు, పెరవలి, ఉండ్రాజవరం, వేలివెన్నులో పీహెచ్‌సీలు ఉన్నాయి. పారిశుద్ధ్యం మెరుగుపడని కారణంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో దోమకాటుతో ఎలాంటి రోగాలు సోకుతాయోనని ప్రజలంతా వణికిపోతున్నారు. తాడిమళ్ల, సమిశ్రగూడెం పీహెచ్‌సీల్లో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఆదివారం వస్తే ఆసుపత్రులకు తాళం వేస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి క్యూ కడుతున్నారు. ఆసుపత్రిలో 30 పడకలు ఉండగా రోజుకు సుమారు 80 మందికి తాత్కాలిక బెడ్లు ఏర్పాటుచేసి వైద్యం అందిస్తున్నారు. ప్రతి రోజు సుమారు 250 మంది నుంచి 300 మంది వరకు ఓపీ సేవలు పొందుతున్నారు.


ప్రభుత్వాసుపత్రిలో రోగుల కోసం వరండాలో వేసిన బెడ్లు

గ్రామాల్లో అధ్వానంగా పారిశుద్ధ్యం..

గ్రామీణ ప్రాంతాల్లో అధ్వాన పారిశుద్ధ్యంతో పాటు ఆరోగ్య జాగ్రత్తలు పాటించకపోవడం, పౌష్టికాహార లోపం తదితర కారణాలతో పాటు ప్రస్తుతం మారిన వాతావరణ పరిస్థితులతో జనం ఒక్కొక్కరిగా అస్వస్థతకు గురవుతున్నారు. వాతవరణంలోని స్వల్ప మార్పులతో సమిశ్రగూడెంలోని ఎస్సీ ఏరియా, వైఎస్సార్ కాలనీల్లో అధ్వానంగా డ్రైయిన్లు ఉండటంతో దోమల విజృంభిస్తున్నాయి. మేజర్ తాడిమళ్ల, కోరుమామిడి తదితర గ్రామాల్లో మురుగు పారేందుకు డ్రైయిన్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది.


సమిశ్రగూడెం ఎస్సీ కాలనీలో అధ్వానంగా వ్యర్థాలు

అశ్రద్ధ చేయకూడదు..



వర్షాకాలంలో వ్యాధుల పట్ల అశ్రద్ధ చేయకూడదు. ఎక్కువగా మలేరియా, డెంగీ, సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. ఎవరైనా అస్వస్థతకు గురైతే వెంటనే ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకోవాలి.

– డాక్టర్ ఫైయాజ్, ఆసుపత్రి సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, నిడదవోలు

గతంలో మెరుగైన వైద్యం..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేది. నాడు–నేడు పథకం ద్వారా ఆసుపత్రులను ఆధునీకరణ చేసి వాటిల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచారు. అవసరమైన సిబ్బందిని కూడా రోగులకు అందుబాటులో ఉంచారు. దీనికి తోడు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వైద్యం అందేలా చేశారు. అప్పటి పాలనకు..ఇప్పటి పాలనకు తేడా గమనిస్తున్న ప్రజలు కూటమి ప్రభుత్వం పేదలకు ఉచిత వైద్యం అమలుపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషిచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

మహిళ నాయకురాలకి తలారి పరామర్శ


పెద్దేవంలో వెంకటలక్ష్మి కుటుంబాన్ని పరామర్శిస్తున్న తలారి వెంకట్రావు

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవం గ్రామంలో ఇటీవల మృతి చెందిన పలువురి వైఎస్సార్ సీపీ నాయకుల కటుంబాలను సోమవారం నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పరామర్శించారు. గ్రామానికి చెందిన పార్టీ మహిళా అధ్యక్షురాలు ఉప్పలపాటి వెంకటలక్ష్మి భర్త వైఎస్సార్ సీపీ నాయకుడు నేకూరి రత్తయ్య మృతి చెందడంతో ఆమె కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, ఉప సర్పంచ్ తోట రావకృష్ణ, నాయకులు నల్లాకుల వేణుగోపాలకృష్ణ, కోడి గంగారావు, ఎండపల్లి కష్టార్జునులు ఉన్నారు.

ఉచిత నేత్ర వైద్య పరీక్షలు

ఉండ్రాజవరం: బౌద్ధధమ్మ పీఠం ఆధ్వర్యంలో విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు బౌద్ధ పీఠాధిపతి బంతె అనాలియో అన్నారు. ఉండ్రాజవరం బౌద్ధధమ్మ పీఠం ఆధ్వర్యంలో మైత్రేయ బుద్ధ విహర్ ప్రాంగణంలో సోమవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగనంద కంటి ఆసుపత్రి వైద్యులు సుమారు 180 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేసి, 21 మందికి అపరేషన్లుకు రిఫర్ చేశారు. పలువురికి కళ్లజోళ్లు, మిగిలిన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా బంతె అనాలియో మాట్లాడుతూ శస్త్ర చికిత్సలు అవసరమైన రోగులకు మధ్యాహ్నం భోజనంతో పాటు ఆసుపత్రికి తీసుకువెళ్లి, ఆపరేషన్ అనంతరం వాళ్ల ఇంటికి పంపిస్తామన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ


గ్రామ పంచాయతీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ అమ్మాజీ

నల్లజర్ల: మండలంలోని చీపురుగూడెం గ్రామపంచాయతీలో నిధులు దుర్వినియోగంపై ఫిర్యాదు అందడంతో సోమవారం కొవ్వూరు డీఎల్‌పీఓ వై.అమ్మాజీ విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన పెనుమాక వెంకటరత్నం 2022–24 సంవత్సరాలలో సమాచార హక్కు చట్టం ద్వారా పలు అంశాలపై గ్రామ పంచాయతీ చేసిన తీర్మానాలను సేకరించారు. అజెండాలో వివిధ అంశాలకు సంబంధించి వార్డు సభ్యుల సంతకాలు లేకుండానే తీర్మానాలు చేసి సర్పంచ్ గాలింకి మల్లిక బిల్లులు చేసుకున్నారని, నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు గుర్తించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎల్‌పీఓ రికార్డులు పరిశీలించి తేడా జరిగినట్టుగా గుర్తించి పరిశీలన కోసం ఆమె వెంట తీసుకెళ్లారు. నిధులు ఏ మేరకు దుర్వినియోగం అయ్యాయో విచారణ తదనంతరం వివరిస్తామని ఆమె వెల్లడించారు. విచారణలో ఎంపీడీఓ సింహాద్రిరావు, పూర్వపు, ప్రస్తుత కార్యదర్శులు మోషేన్ రాజు, రామారావు గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలి

తాళ్లపూడి (కొవ్వూరు): కొవ్వూరు బస్టాండ్ సెంటర్ వద్ద సోమవారం మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారానికి ఆరోవ రోజుకు చేరుకుంది. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందర్ బాబు మాట్లాడుతూ జీవో 279 ఒప్పంద కాంట్రాక్టు కార్మికులుగా పనిచేసిన వారందరికి గత ప్రభుత్వం ఆప్కాస్ వ్యవస్థ ద్వారా నేరుగా జీతాలు చెల్లించేదని వివరించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం జీతాలను కాంట్రాక్ట్ పద్ధతిలో చెల్లించి తమను తాత్కలిక ఉద్యోగులుగా పరిగణించడం దారుణమని ఈ విధానంతో కార్మికులు అన్ని విధాలుగా నష్టపోతున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు భూపతి రవీంద్ర, కార్యదర్శి పూజారి వాసు, కోశాధికారి కళ్యాణ్ రాజేష్, కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యార్థులు ఉన్నతంగా స్థిరపడాలి


మాధురిని నగదు పురస్కారంతో సత్కరిస్తున్న ఎంఈవో, పూర్వ విద్యార్థులు

తాళ్లపూడి: ప్రణాళికా బద్ధంగా ఇష్టపడి చదివితే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సైతం ఉన్నత స్థానాలకు చేరవచ్చని ఎంఈవో సీహెచ్ బాలమణి అన్నారు. వేగేశ్వరాపురం కేఎస్ ఆర్.ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2023 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థిని సిద్దా మాధురి ఇటీవల ఐఐటీ ధన్‌బాద్‌లో (జార్ఖండ్) సీటు పొందారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నగదు పురస్కారాన్ని విద్యార్థినికి అందించారు. ప్రొఫెసర్ కె.వి సుబ్బారావు, మారిన రామ్మూర్తి, లక్కిరాజు, శారదా దేవి రూ.5000 చొప్పున, శీర్ల బ్రహ్మానందం రూ.3,000 శీర్ల సత్యనారాయణ రూ.2,000, మొత్తం రూ. 20,000 నగదు బహుమతిని ఎంఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చేతులు మీదుగా అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం నుంచి అన్ని సౌకర్యాలు కల్పిస్తు, విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారని కష్టపడి చదివి మరిన్ని ర్యాంకులు పొందాలన్నారు. అడ్డాల డేవిడ్ రాజు, మారిశెట్టి సత్యనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనలో భాగస్వామ్యులు కావాలి


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై కె.నరేంద్ర

చాగల్లు: మహిళల రక్షణ చట్టాలపై విద్యార్థినులు తప్పనిసరిగా అవగాహన పెంచుకోవాలని చాగల్లు ఎస్సై కె.నరేంద్ర అన్నారు. స్థానిక ఎస్‌వీఆర్‌కే జూనియర్ కళాశాలలో మహిళల రక్షణ, డ్రగ్స్ వాడకంతో కలిగే అనర్థాలపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు, బాలికల రక్షణ కోసం ప్రభుత్వం పోక్సో, దిశ, నిర్భయ తదితర రక్షణ చట్టాలాను అమలులోకి తెచ్చిందన్నారు. కావున ఈ చట్టాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. డ్రగ్స్ వినియోగంతో కలిగే నష్టాలను వివరించారు. సమాజంలోని డ్రగ్స్ వినియోగం ఎక్కువైందని మత్తు నిర్మూలనలో మహిళలు భాగస్వామ్యులు కావాలని కోరారు. ఎక్కడైనా, ఎవరైనా డ్రగ్స్ వినియోగించిన, సరఫరా చేసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


పసలపూడి రాఘవ (ఫైల్)

దేవరపల్లి: ఎన్టీఆర్ జిల్లా హనుమాన్ జంక్షన్ బైపాస్ రోడ్డులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవరపల్లి మండలం పల్లంట్లకు చెందిన యువకుడు పసలపూడి రాఘవ(25) మృతి చెందాడు. పోలీసుల కథనం మెరకు తాడేపల్లిగూడెం రూరల్ మండలం పత్తిపాడు సమీపంలోని జల్లి కృష్ణంపాలెంకు చెందిన యల్లమెల్లి భాస్కరరావు (47) భాస్కరరావు అనారోగ్యానికి గురికావడంతో వైద్యం నిమిత్తం అల్లుడు వరుస అయిన రాఘవ బైక్‌పై విజయవాడ ఆసుపత్రికి తీసుకు వెళ్తుండగా, హనుమాన్ జంక్షన్ సమీపంలో వెనుక నుంచి వస్తున్న లారీ వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహానాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సమాచారం తెలుసుకున్న మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు హుటాహుటీన సంఘటన ప్రదేశానికి తరలి వెళ్లారు. యువకుడి మృతి చెందడంతో పల్లంట్లలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఆటవిడుపుగా మారిన పీజీఆర్‌ఎస్

- పని చేయని నిఘా వ్యవస్థ
- సమయానికి విధులకు రాని అధికారులు


పెరవలి తహసీల్దార్ కార్యాలయంలో పనిచేయని సీసీ టీవి

పెరవలి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన పీజీఆర్‌ఎస్‌లో పెరవలి తహసీల్దార్ కార్యాలయంలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో గత ఐదు నెలలుగా ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరేట్‌లో ఏం జరుగుతుందో తెలియటం లేదు. దీనితో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరైన అధికారులు సంతకాలు పెట్టి ఏదో ఒకటి సాకు చెప్పి వెళ్లిపోవటంతో ఫిర్యాదు దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు ఫిర్యాదులను స్థానిక సచివాలయాలకు పంపించి అక్కడ నమోదు చేసుకోవాలని అధికారులు చెప్పడంతో ఊసూరుమంటూ తిరిగి వెళ్లుతున్నారు. ఉదయం 10.గంటలకు హాజరవ్వవలసి ఉండగా వారి ఇష్టానుసారంగా వచ్చి వెళ్లిపోతున్నారని, నిఘానేత్రాలు పనిచేయకపోవడంతో అధికారులకు ఆడింది ఆటగా, పాడింది పాటగా సాగుతుందని ఫిర్యాదుదారులు అంటున్నారు. మరమ్మతులు చేయాలని ఉన్నతాధికారులకు ఓ లెటర్ రాసి పంపించి చేతులు దులుపుకున్నారు. దీనితో సీసీలకు విశ్రాంతి, అధికారులకు మనశ్శాంతి లభించిందని అర్జీదారులు చెప్పుకుంటున్నారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కారించాలి

తాళ్లపూడి(కొవ్వూరు): 'పీజీఆర్‌ఎస్–మీ కోసం 'కార్యక్రమానికి డివిజన్ స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత ఉద్యోగులను ఆదేశించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం మీ కోసం వేదికలో వచ్చిన పలువురు ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ రకాల సమస్యలపై 19 అర్జీలను స్వీకరించామని పేర్కొన్నారు. వచిన ప్రతి అర్జీని పరిశీలించి, వారు సంతృప్తి చెందేలా అధికారులు చొరవ తీసుకొలన్నారు. వారంలో రెండు రోజులు ఆయా ప్రభుత్వ శాఖలకు సంబంధించి జిల్లా అధికారి, డివిజన్ అధికారులతో తప్పనిసరిగా సమావేశం నిర్వహించి అర్జీలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

కలెక్టర్ ఆదేశాలతో అధికారుల విచారణ

గోపాలపురం: మండలంలోని భీమోలు గ్రామంలో సర్వే నంబర్ 558లో నాలుగు ఏకరాల భూమిని ఆన్‌లైన్ చేశామని నమ్మబలికి తన వద్ద నుంచి రూ.14 లక్షలు వసూలు చేశారంటూ బాధితుడు పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు. రాజమహేంద్రవరంకు చెందిన మాజీ మిలటరీ ఉద్యోగి దాసరి నరసింహారెడ్డి అనే వ్యక్తి నుంచి గతంలో తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఎస్ డీటీగా పనిచేసిన ఎస్.కృష్ణ, గోపాలపురం గ్రామానికి చెందిన గెల్లా శ్రీను, భీమోలు గ్రామానికి చెందిన కాకులపాటి శ్రీనులు ఆతడి వద్ద అక్రమంగా డబ్బులు వసూలు చేశారంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలతో స్పెషల్ డిప్యూటి కలెక్టర్ ఎస్. భాస్కరరెడ్డి బృందం విచారణ చేపట్టారు. నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు.

ఫేస్ యాప్‌లతో నరకయాతన


పెరవలిలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్స్, గర్భిణులు

పెరవలి: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలపై మోయలేని భారం మోపి ఉద్యోగులు స్వతహాగా ఉద్యోగం వదలి వెళ్లేలా నిబంధనలు విధిస్తున్నారని ఇది దారుణమాని సీఐటీయూ నియోజకవర్గ నాయకుడు జువ్వల రాంబాబు ధ్వజమెత్తారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలతో కలిసి ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ యూనియన్ ప్రెసిడెంట్ కె.కృష్ణవేణి మాట్లాడుతూ ఫేస్ యాప్ రద్దు చేయాలని, సెంటర్‌కు ఒక యాప్ మాత్రమే ఉండాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, తల్లులు, పిల్లలకు విడివిడిగా యాప్‌లు ఉంటే పనిభారం పెరిగి పిల్లల పనులు టైమ్‌కి చేయలేమన్నారు. అనంతరం ఐసీడీఎస్ సీడీపీఓ ఎస్.ఆశా రోహిణికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.లక్ష్మీ కుమారి, బి విక్టోరియా రాణి, పి.పార్వతి, యు.ధనలక్ష్మి, కె.లక్ష్మీ బంగారమ్మ, కె.రామలక్ష్మి, పి.గిరిజా తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

చాగల్లు: చాగల్లు మండలం దారవరం గ్రామానికి చెందిన పదహారేళ్ల బాలిక అదృశ్యమైనట్లు ఎస్సై కె.నరేంద్ర సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ బాలిక ప్రస్తుతం చదువు మానేసి ఇంటి వద్దనే ఉంటుందన్నారు. ఈ నెల 17వ తేదీ రాత్రి నుంచి ఆమె కనిపించడం లేదని, చట్టుపక్కల, బంధువుల ఇంటి వద్ద వెతికినా కనిపించకపోవడంతో తల్లి కొవ్వల ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు. బాలిక వివరాలు ఎవరికైనా తెలిస్తే స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

1,600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

గోపాలపురం: జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ ఆదేశాల మేరకు గోపాలపురం పెద్దగూడెం గ్రామ శివార్లలో నాటు సారా తయారీ బట్టీలపై దాడులు నిర్వహించి 1,600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని ఎస్సై పి.మనోహర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడతూ కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్, దేవరపల్లి సీఐ నాగేశ్వరనాయక్ పర్యవేక్షణలో నాటు సారా తయారీకి ఉపయోగించే 8 డ్రమ్ములను, నల్ల బెల్లాన్ని ధ్వంసం చేశామని, 25 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

చదరంగంతో మేధస్సుకు పదును

నిడదవోలు: మనిషి మేధస్సుకు పదును పెట్టె చదరంగంలో విద్యార్థులు తమ ప్రతిభను కనబరుస్తూ జాతీయ స్థాయిలో సత్తా చాటాలని నిడదవోలు సీఐ పీవీజీ తిలక్ ఆకాంక్షించారు. పట్టణంలో రోటరీ ఆడిటోరియంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన చదరంగం పోటీలను ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలకు చెందిన 120 మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. అనంతరం గెలుపొందిన విజేతలకు ఎంఈవో పి.గురుమూర్తి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మీసాల ప్రసాద్, దారపురెడ్డి ప్రతాప్, గుంటిపల్లి సానిపు వెంకట సుబ్బారావు, మారిశెట్టి అమ్మిరాజు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న ఏడుగురి అరెస్టు

నిడదవోలు: పట్టణంలోని జగనన్న కాలనీలో గంజాయి సేవిస్తున్న ఏడుగురు యువకులను నిడదవోలు సీఐ పీవీజీ తిలక్ సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఎస్సై జగన్‌మోహన్‌రావు తెలిపారు. ఈ మేరకు ఎస్సై మాట్లాడుతూ స్థానిక జగనన్న కాలనీలో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో ఆదివారం రాత్రి సిబ్బందితో కలిసి దాడులు చేయగా కాలనీకి చెందిన వెలిచర్ల నాగరాజు, రెల్లి కాలనీకి చెందిన కాకి కార్తిక్, ఎన్టీఆర్ కాలనీకి చెందిన నక్కల రసిల్, శాంతినగర్‌కు చెందిన మహమ్మద్ దస్తగిరి, బస్టాండ్ సెంటర్‌కి చెందిన గేదెల హేమంత్‌నాగదుర్గ, చర్చిపేటకు చెందిన దూలపల్లి రాజ్‌కుమార్‌లను గంజాయితో అదుపులోకి తీసుకున్నారు. చెడు వ్యసనాలను బానిసైన వెలిచర్ల నాగరాజు గంజాయి కొనుగోలు చేసి స్థానిక కళాశాల విద్యార్థులకు 50 గ్రాములు రూ.500 చొప్పున విక్రయిస్తున్నాడని తెలిపారు. రూ.40 వేల విలువైన 5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని వివరించారు. నిడదవోలు సీఐ పీవీజీ తిలక్ మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలను, వినియోగాన్ని సమూలంగా నిర్మూలిస్తామని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పశ్చిమడెల్టాకు నీటి విడుదల తగ్గింపు

నిడదవోలు: పశ్చిమడెల్టా ప్రధాన కాలువకు నీటి విడుదలను తగ్గిస్తున్నట్లు ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆదివారం 7,200 క్యూసెక్కులు నీటిని నిడదవోలు మండలం విజ్జేశ్వరం హెడ్‌స్లూయిజ్ నుంచి విడుదల చేయగా సోమవారం దానిని 4,700 క్యూసెక్కులకు తగ్గించామన్నారు.

